క్లుప్తంగా

నేడు అద్దంకి మున్సిపాలిటీ సాధారణ సమావేశం

అద్దంకి రూరల్: అద్దంకి మున్సిపల్ కౌన్సిల్ హాలులో శనివారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించనున్నట్లు శుక్రవారం చైర్‌పర్సన్ ఎల్. ఎస్తేరమ్మ శుక్రవారం తెలిపారు. సమావేశానికి సభ్యులంతా హాజరు కావాలని కోరారు.

1882 మంది పొగాకు రైతుల పేర్లు నమోదు

యద్దనపూడి: మండలంలో పొగాకు సాగుచేసిన 1882 మంది రైతుల పేర్లను నమోదు చేసినట్లు వ్యవసాయాధికారి మేరమ్మ తెలిపారు. మండలంలోని రైతుభరోసా కేంద్రాల పరిధిలో ఉన్న రైతుల పేర్లను వీఏఏ ద్వారా సేకరించినట్లు తెలిపారు. మండలంలో మెత్తం 10400 ఎకరాల్లో పొగాకు సాగుచేయగా 10 మిలియన్ కిలోల పొగాకును రైతులు పండించినట్లు తెలిపారు.

నీటి సరఫరా నిలిపివేత

చీరాల: చీరాల పురపాలక సంఘంలోని దండుబాట జాలమ్మ గుడి ఎదురు గల రిజర్వాయరు పరిధిలో పైపు లైన్ల వాల్వ్‌స్ మరమ్మతుల కారణంగా శనివారం 22, 25 వార్డులలోని వైకుంఠపురం, స్వర్ణరోడ్డు, శ్రీరామ్‌నగర్, గాంధీనగర్, ప్రకాశ్‌నగర్ ఏరియాల్లో మంచినీటి సరఫరాను నిలిపివేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్ శుక్రవారం తెలిపారు. ఆదివారం యథావిధిగా మంచినీటి సరఫరా చేయనున్నట్లు తెలిపారు.

ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు



కొరిశపాడు ఎస్టీ కాలనీలో పిల్లలు, తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు

మేదరమెట్ల: ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను గుర్తించి వారిని భవిత కేంద్రంలో చేర్పించడం ప్రభుత్వం అందచేసే సౌకర్యాలను అందించడం కోసం సర్వే చేస్తున్నట్లు భవిత కేంద్రం ఉపాధ్యాయుడు పీవీ కొండయ్య తెలిపారు. సర్వేలో భాగంగా మండల కేంద్రమైన కొరిశపాడు ఎస్టీ కాలనీలో శుక్రవారం సర్వే నిర్వహించి ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను గుర్తించినట్లు తెలిపారు. వారిని చేర్పించి ప్రభుత్వ సదుపాయాలను పొందాలని తల్లి దండ్రులకు అవగాహన కల్పించారు.

నీడ లేక గోమాతల ఘోష





చిరిగిపోయిన టెంట్‌లో నిలబడి ఉన్న ఆవులు

- ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తున్న ఆవులు
- తానే అన్నీ అయి పెంచుతున్న గోనుగుంట సుబ్బారావు
- స్థానికుల సహకారంతో మేత సమకూరుతున్న వైనం
- గోశాలకు స్థలం కేటాయించాలని వేడుకోలు

అద్దంకి: పట్టణంలోని హరిహర గోశాలలో సుమారు 80 ఆవులు వరకు సేద తీరుతున్నాయి. ఈ ఆవులను పట్టణానికి చెందిన గోనుగంట సుబ్బారావు పలువురు దాతల సహకారంతో పోషిస్తున్నాడు. ఆవులకు ప్రత్యేక గోశాల లేకపోవడంతో అవి ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ అల్లాడుతున్నాయి. తలా ఒక చెయ్యి వేయడంతో మేత, తవుడుకు ఎలాంటి ఢోకా లేకుండా నడుస్తోంది. కానీ గోమాతలు సేద తీరేందుకు సరైన నీడ కరువడంతో వాటి ఘోష ఆలకిస్తున్న పలువురు ప్రకృతి ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అవి చేస్తున్న అరుపులకు చుట్టుపక్కల వారు కలత చెందడం నిత్యం జరుగుతూనే ఉంది.

గో రక్షకునిగా..

సుబ్బారావుకు మొదటి నుంచి గోమాతలంటే ప్రాణం. దీంతో రెండు ఆవులను మొదట్లో తన డాబా ఇంట్లోనే ఒక పోర్షన్‌లో సంరక్షించే వాడు. పూజలకు ఉచితంగా ఆవు పేడతో విభూది తయారు చేసి దేవాలయాలకు ఉచితంగా అందిస్తుంటాడు. ఇటీవల సుబ్బారావుకు గో సంరక్షణకు సంబంధించి అవార్డు కూడా వచ్చింది. ఈ క్రమంలో 15 ఏళ్ల క్రితం స్థానిక ఎమ్మెల్యే ఒక మేలు జాతి ఆవును సుబ్బారావుకు అప్పగించాడు. ఆ సంతతి ఇప్పుడు ఐదుకు చేరింది. అదే విధంగా సుబ్బారావు ఆవులను కంటికి రెప్పలా చూసుకుంటున్నాడనే విషయం తెలిసిన ఆవుల యజమానులు తాము పోషించలేని ఆవులను గోశాలకు అప్పగించారు. దాంతో ఇప్పుడు గోశాలలో వివిధ రకాలకు చెందిన 80 ఆవుల వరకు ఉన్నాయి. వాటి సంఖ్య ఎక్కువ కావడంతో ఆవులకు నీడ వేసుకోవడం కోసం స్థలం కేటాయించాలని, సుబ్బారావు, స్థానిక రెవెన్యూ అధికారులను మంత్రిని కలిసి విన్నవించుకున్నాడు. ఈ క్రమంలో స్థలం కేటాయిస్తామని చెప్పిన అధికారులు స్థలం కేటాయించక పోవడంతో గోవులు ఘోషిస్తున్నాయి. ఎండకు నిలవలేక అరుస్తూ ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు గోశాలకు స్థలం కేటాయించాలని స్థానికులు, గోశాల సంరక్షకుడు సుబ్బారావు కోరుతున్నాడు.

> **సరైన వసతులు లేవు**
>
> గోమాతల మీద ఉన్న మమకారంతో నేను ఆవులను నా సొంత ఇంట్లో పెట్టి పోషించాను. ఆ తరువాత వాటి సంఖ్య ఎక్కువ కావడంతో అక్కడ స్థలం చాలలేదు. దాతలు కొందరు ఒక పాత మిల్లు స్థలాన్ని తాత్కాలికంగా ఇచ్చారు. అయితే అక్కడ ఆవులన్నింటికీ నీడ లేదు. మంత్రిని కలవడంతో ఆయన స్థలం ఇవ్వమని అధికారులకు చెప్పారు. కానీ ఇంత వరకు ఎవరూ పట్టించుకోవడంలేదు.
>
> – సుబ్బారావు, నిర్వాహకుడు

మైనర్‌లకు బైక్ ఇస్తే సీజ్

- 10 మంది వాహనచోదకులకు జరిమానా



బల్లికురవలో వాహన దారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై

బల్లికురవ: రోడ్డు ప్రమాదాలు జరగకుండా వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్సై వై. నాగరాజు కోరారు. శుక్రవారం సాయంత్రం బల్లికురవ నుంచి సంతమాగులూరు వెళ్లే ఆర్ అండ్‌బీ రోడ్డులో వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. వాహనాలకు సంబంధించి గతంలో ఉన్న పాత చలానాలను తక్షణమే చెల్లించాలన్నారు. ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపవద్దని హెల్మెట్ విధిగా ధరించాలని ఇద్దరికే బైక్‌ను పరిమితం చేసుకోవాలని మైనర్‌లకు బైక్ ఇస్తే సీజ్ చేస్తామని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని హెల్మెట్ ధరించని 10 మందికి పెనాల్టీ విధించినట్లు ఎస్సై వివరించారు.

ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలి



కారంచేడు పీహెచ్‌సీ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, సిబ్బంది

కారంచేడు: ప్రభుత్వ ఉద్యోగులకు వెంటనే ఐఆర్‌ను ప్రకటించడమే కాకుండా సీపీఎస్ విధానం రద్దు చేయాలని ఉద్యోగ సంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి పసుమర్తి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మండల కేంద్రమైన కారంచేడు పీహెచ్‌సీ వద్ద యూనియన్ నాయకులు, సిబ్బందితో కలిసి కొన్ని డిమాండ్లపై నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 5వ తేదీన విజయవాడలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న మూడో రాష్ట్ర కౌన్సిల్ సమావేశం జయప్రదం చేయాలని ఉద్యోగులకు సూచించారు. 12వ పీఆర్‌సీ కమిషన్‌ను కూడా వెంటనే నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేయాలన్నారు. ఈ డిమాండ్లతో జరిగే స్టేట్ కౌన్సిల్ సమావేశానికి ఉద్యోగ, ఉపాధ్యాయులతో పాటు, కార్మిక, పెన్షనర్లు తప్పకుండా హాజరు కావాలన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గోరంట్ల సురేష్‌బాబు, మోహనరావు, యూనియన్ నాయకులు సుబ్బారావు, వసంతవల్లి, శ్రీనివాసరావు, ఆంజనేయులు, సుజాత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న కాలనీపై అక్కసు



జగనన్న కాలనీలో చెత్త వేసిన ప్రాంతం

పర్చూరు(చినగంజాం): మండలంలోని కొల్లావారి పాలెం జగనన్న కాలనీవాసులు తమ సమస్యలను పట్టించుకునే వారు కరువయ్యారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత నాలుగు సంవత్సరాలుగా గ్రామంలోని చెత్తను తీసుకొని వచ్చి కాలనీలో వేస్తున్నారు. చెత్త ఎక్కువ కావడంతో కాలనీ వాసులకు తీవ్ర అసౌకర్యంగా మారింది. పలు మార్లు సమస్యను అధికారుల దృష్టికి తీసుకొని వెళ్ళినా ఫలితం లేకుండా పోయింది. తమ సమస్యను అధికారులు గాని, ప్రజా ప్రతినిధులు గాని పట్టించుకోలేదని తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. గడచిన 12 నెలలుగా కూటమి ప్రభుత్వం ఏర్పడిన దగ్గరు నుంచి స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా ఇదే ప్రాంతాన్ని డంపింగ్ యార్డుగా మార్చి చెత్తను తీసుకొని వచ్చి పడవేస్తున్నారే గాని స్థానిక కాలనీ వాసులు సమస్యను గురించి పట్టించుకోవడం లేదు. డంపింగ్ యార్డును అక్కడి నుంచి తొలగించి వేరే ప్రాంతంలో ఏర్పాటు చేసి తమ సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఈ విషయమై ఈఓపీఆర్డీ కె. సత్యనారాయణను వివరణ కోరగా స్థానిక పంచాయతీ కార్యదర్శిగా ఆదేశాలిచ్చి గ్రామంలో వేసిన చెత్తను తొలగిస్తామని గ్రామ ప్రజలకు ఇబ్బందిగా మారిన చెత్త సమస్య పరిష్కారానికి సత్వరం చర్యలు తీసుకుటామన్నారు.

బైక్‌ను ఢీ కొట్టిన కారు.. దంపతులకు గాయాలు

అద్దంకి: మోటారు బైక్‌ను కారు ఢీ కొట్టిన ఘటనలో దంపతులకు గాయాలైన సంఘటన మండలంలోని కొంగపాడు క్రాస్ రోడ్ వద్ద శుక్రవారం జరిగింది. అందిన సమాచారం మేరకు.. మండలంలోని మోదేపల్లి గ్రామానికి చెందిన నూతలపాటి శ్రీను, అతని భార్య ఆదిలక్ష్మి మణికేశ్వరం నుంచి మోటారు బైక్‌పై అద్దంకి వస్తుండగా, కొంగపాడు క్రాస్ రోడ్ వద్ద బైక్‌ను కారు ఢీ కొట్టింది. ఈ ఘటనలో దంపతులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు చేర్చారు.

పచ్చిరొట్ట పైర్లతో భూసారం పెంపు

బల్లికురవ: వర్షాలు కురుస్తున్నందున పచ్చిరొట్ట పైర్ల సాగుతో భూసారాన్ని పెంచుకోవచ్చని మండల వ్యవసాయాధికారి ఎస్‌వీపీ కుమారి శుక్రవారం తెలిపారు. 20 రైతు సేవా కేంద్రాల ద్వారా 50 శాతం సబ్సిడీపై జనుము, జీలుగ, విత్తనాలు అందజేస్తున్నామని కావల్సిన రైతు రిజిస్ట్రేషన్‌తో సొమ్ము చెల్లించి పొందవచ్చన్నారు. జనుము సబ్సిడీ పోను కిలో రూ. 54.50 జీలుగ రూ 61,50 చెల్లించి పొందవచ్చని పూత దశకు రాగానే పచ్చిరొట్టపైర్లను భూమిలో కలియ దున్నుకోవాలని కుమారి వివరించారు.

కార్మికులను బానిసలుగా చేసేందుకే లేబర్ కోడ్స్ చట్టాలు



సీఐటీయూ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

చీరాల: కేంద్ర ప్రభుత్వం కార్మికుల పట్ల కుట్రపూరిత ధోరణిగా వ్యవహరిస్తూ యాజమాన్యానికి కార్మికులను బానిసలుగా మార్చేందుకు లేబర్ కోడ్స్ చట్టాలను అమలు చేసేందుకు ప్రణాళిక చేసిందని సీఐటీయూ కార్యదర్శి ఎం.వసంతరావు అన్నారు. శుక్రవారం సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని పేరాలలో ఉన్న స్థానిక కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరణను పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.బాబూరావు, ఎం.వసంతరావు చేశారు. కార్మికులందరూ ఎన్నో పోరాటాలతో పోరాడి సాధించుకున్న హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందన్నారు. పోరాడి సాధించుకున్న సమ్మె హక్కును.. వేతనాల పెంపుదలను, ఉద్యోగ భద్రత ఇవన్నీ లేబర్ కోడ్స్ అమలు అయితే రద్దు అవుయన్నారు. కేంద్ర ప్రభుత్వ చర్యలను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా జూలై 9న చేపట్టిన దేశవ్యాప్త బందుకు కార్మికులందరూ కదలిరావాలన్నారు. సీఐటీయూ నాయకులు క్రాంతి సాగరు, యేసురత్నం, సింగయ్య, సురేష్, ఐవీ ప్రసాద్ పలువురు పాల్గొన్నారు.

ధర్నాకు తరలివెళ్లిన ఇంకొల్లు సిబ్బంది

ఇంకొల్లు(చినగంజాం): విజయవాడలో నిర్వహించిన ఎండీయూ ఆపరేటర్‌ల ధర్నాకు మద్దతుగా ఇంకొల్లు ఎండీయూ సిబ్బంది శుక్రవారం తరలి వెళ్ళారు. విజయవాడలోని అలంకార్ చౌరస్తా వద్ద నిర్వహించిన నిరసన ధర్నా కార్యక్రమంలో వారు పాల్గొన్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం ఇంటింటికి రేషన్ పంపిణీ చేసేందుకు ఎండీయూ సిబ్బందిని నియామకం చేసిందని, కానీ ప్రస్తుత ప్రభుత్వం సంవత్సర కాలంలోనే ఎండీయూల జీవనోపాధి లేకుండా చేసిందని వాపోయారు. ఎండీయూ ఆపరేటర్స్ ప్రెసిడెంట్ ఇస్తర్ల శ్రీనివాసరావు, భవనం శ్రీనివాసరెడ్డి, గంధం సుబ్బారావు, గొర్రెముచ్చు సుబ్బారావు తదితరులు తరలి వెళ్లారు.

యోగాతో పరిపూర్ణ ఆరోగ్యం



అడుసుమల్లిలో యోగా శిక్షణ పొందుతున్న సచివాలయ సిబ్బంది

పర్చూరు(చినగంజాం): ప్రతి రోజూ యోగా చేయడం ద్వారా ఆరోగ్యాన్ని చక్కబెట్టవచ్చు అని ఈఓపీఆర్డీ కె. సత్యనారాయణ అన్నారు. మండలంలోని అడుసుమల్లి గ్రామంలో నిర్వహిస్తున్న యోగా శిక్షణలో భాగంగా రెండో రోజు శుక్రవారం కార్యక్రమాలను ఆయన సందర్శించి మాట్లాడారు. యోగ శిక్షణ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శిక్షకుని ద్వారా సచివాలయ సిబ్బంది, స్థానిక యువకులకు యోగాసనాలపై శిక్షణ ఇప్పించారు. శ్వాస మీద ధ్యాస ఉంచడం ద్వారా ఏకాగ్రత పెంచుకోవచ్చుఅని, మానసిక ఒత్తిళ్ళు తగ్గించుకోవచ్చు అని పేర్కొన్నారు, శిక్షణలో పాల్గొన్న వారికి జూన్ 2 వతేదీ మండల కేంద్రం పర్చూరులో యోగాపై యువతీ యువకులకు పోటీ నిర్వహిస్తారని, గెలుపొందిన వారికి బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేస్తారని తెలిపారు. సచివాలయ సిబ్బంది, గ్రామంలోని యువకులు పాల్గొన్నారు.

ఫోన్ ద్వారా విద్యుత్ సమస్యల పరిష్కారం

చీరాల: చీరాల విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ అంతరాయం, సమస్యలను ఆయా సబ్‌స్టేషన్ల ఫోన్ నంబర్లకు ఫోన్ చేసి సమస్యను తెలియపరచవచ్చని సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.హరిప్రసాదరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డి1 పరిధిలో 9490615411, చీరాల గవర్నమెంట్ హాస్పిటల్ సబ్‌స్టేషన్ పరిధిలో 9440818824, చీరాల రూరల్ సబ్‌స్టేషన్ 9490615412, గంజిపాలెం సబ్‌స్టేషన్ 8330938829, దండుబాట సబ్‌స్టేషన్ 7382716284, జాండ్రపేట 7382601002, ఈపూరుపాలెం 9490598717, చీరాల రూరల్ పరిధిలో 9490615412 నంబర్లను సంప్రదించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

చినగంజాం: మండలంలోని కడవకుదురు గ్రామంలో శనివారం కొత్తగా లైన్ వర్క్ నిర్వహిస్తున్న సందర్భాన్ని పురస్కరించుకొని విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ పడవల గణనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని.. ప్రజలు సహకరించాలని కోరారు.

నాసిరకంతో మమ..!



ట్రాక్ నిర్మాణానికి వాడుతున్న సిమెంట్ రాళ్లు



జేడు మట్టికి బదులుగా వాడుతున్న ఇసుక

- హైస్కూల్ రన్నింగ్ ట్రాక్ నిర్మాణపు పనుల్లో నాణ్యత డొల్ల
- ట్రాక్ నిర్మాణానికి రూ. 5 లక్షలు మంజూరు చేసిన ప్రభుత్వం
- గత నెల రోజులుగా కొనసాగుతున్న పనులు

చినగంజాం: మండల కేంద్రంలోని చినగంజాం హైస్కూల్‌లో ఆట స్థలంలో ప్రస్తుతం చేస్తున్న రన్నింగ్ ట్రాక్ నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ట్రాక్ నిర్మాణపు పనులకు అవసరమైన ఉన్నత ప్రమాణాలు పాటించకుండా ఏదో తూతూ మంత్రంగా పనులు నిర్వహిస్తున్నారు. చినగంజాం హైస్కూల్‌లో విద్యార్థుల క్రీడల కోసం ఉన్నత ప్రమాణాలతో రన్నింగ్ ట్రాక్, క్రీడల కోర్టులు మంజూరు కాగా గత నెల రోజులుగా రన్నింగ్ ట్రాక్ నిర్మాణపు పనులు కొనసాగుతున్నాయి. ప్రభుత్వం ఇటీవల మండల కేంద్రాల్లోని హైస్కూల్స్ ఆట స్థలాల్లో విద్యార్థుల క్రీడల కోసం రన్నింగ్ ట్రాక్‌లు, ఇతర క్రీడల కోసం కోర్టులు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. అందుకోసం సమగ్ర శిక్ష ద్వారా ఒక్కొక్క హైస్కూల్‌కు రూ. 5 లక్షలు నిధులు సైతం మంజూరు చేసింది. ఇందులో భాగంగా చినగంజాం హైస్కూల్‌లో నెల రోజుల క్రితం రన్నింగ్ ట్రాక్ నిర్మాణపు పనులు ప్రారంభమయ్యాయి. ముందుగా కాంట్రాక్టర్లు గతంలో ఉన్న ఆట స్థలాన్ని చదును చేసి, సుమారు 200 మీటర్లు పొడవు, 10 అడుగుల వెడల్పుతో ట్రాక్ నిర్మాణం చేశారు. ఇందు కోసం సిమెంట్ రాయితో 200 మీటర్లు పొడవున రెండు వరుసల నిర్మాణం చేసి ఉంచారు. సిమెంట్ రాళ్ళతో చేసిన నిర్మాణం మీద పుట్టమట్టి (జేడు మట్టి)ని పరచి దానిపై గ్రావెల్ వేసి ట్రాక్ సిద్ధం చేసేందుకు పనులు నిర్వహిస్తున్నారు. ట్రాక్ పూర్తయిన తరువాత దాని మధ్యలో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో క్రీడలకు సంబంధించిన మూడు కోర్టులను కూడా ఏర్పాటు చేయనున్నారు. ట్రాక్ నిర్మాణపు పనులను పాఠశాల పునఃప్రారంభమయ్యే నాటికి పూర్తి చేసి అందించాల్సి ఉంది. అయితే ట్రాక్ నిర్మాణం జరుపుతున్న తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ట్రాక్ నిర్మాణపు పనులు లోప భూయిష్టం?

రన్నింగ్ ట్రాక్ కోసం 200 మీటర్లు పొడవు నిర్మాణం చేసిన బ్రిక్ ఎడ్జ్ సిమెంట్ రాయిని గోడుగా నిలబెట్టి సిమెంట్ పూసి నిర్మాణం చేశారు. కానీ దానిలో పుట్టమట్టి(జేడు మట్టికి) బదులు నాసిరకం ఇసుక వాడుతున్నారని, ఇప్పటి వరకు జరిగిన నిర్మాణం ఇంత నాసిరకంగా ఉంటే మిగిలిన ట్రాక్ పరిస్థితి ఏమిటని క్రీడాకారులు విమర్శిస్తున్నారు. ట్రాక్ నిర్మాణానికి ప్రభుత్వం రూ. 5 లక్షలు మంజూరు చేస్తే ఉన్నత ప్రమాణాలు పాటించకుండా నాసిరకం మెటీరియల్‌తో నిర్మాణం జరుపుతున్నారంటూ క్రీడాకారులు, గ్రామ ప్రజలు వాపోతున్నారు. ఈవిషయమై సమగ్ర శిక్ష ఏఈ వెంకటరావును సాక్షి వివరణ కోరగా ప్రతి మండలానికి ప్రభుత్వం రూ. 5 లక్షలతో రన్నింగ్ ట్రాక్ నిర్మాణం చేయాలని ప్రతిపాదించిందని, దాని ప్రకారం చినగంజాం మండల కేంద్రంలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో ట్రాక్ నిర్మాణం జరుపుతున్నట్లు తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో ట్రాక్ నిర్మాణాన్ని ఉన్నత ప్రమాణాలు పాటించి పూర్తి చేస్తామని తెలిపారు.



ట్రాక్ రెండు వరుసల నిర్మాణం

నీటి తీరువా బకాయిలు చెల్లించండి

బల్లికురవ: మండలంలోని 14 రెవెన్యూ గ్రామాల్లో రైతులు 52 లక్షల వరకు నీటి తిరువా బకాయిలు చెల్లించాల్సి ఉందని తహసీల్దార్ రవినాయక్ శుక్రవారం తెలిపారు. అత్యధికంగా వైదన రెవెన్యూలో రూ. 20 లక్షల వరకు బకాయి ఉందని నేటి వరకు రూ.6 లక్షలు మాత్రమే వసూలయ్యాయని.. వ్యవసాయ సీజన్ ఆరంభంలో పీఆర్‌వోలకు నీటి తిరువా బకాయిలను రైతులు చెల్లించి సహకరించాలని తహసీల్దార్ కోరారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

బల్లికురవ: గ్రామాల్లోని సిమెంట్ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణ పనులో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే బిల్లుల చెల్లింపును నిలుపుదల చేస్తామని ఒంగోలు క్వాలిటీ కంట్రోల్ డిప్యూటీ ఈఈ ఎంవీ శ్యామ్ ప్రసాద్ హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని బల్లికురవ, వెలమవారిపాలెం, అంబడిపూడి, సోమవరప్పాడు, ఉప్పుమాగులూరు గ్రామాల్లో ఇటీవల రూ. 90 లక్షలతో నిర్మించిన రోడ్లు సైడు కాల్వలను క్వాలిటీ కంట్రోల్ టీమ్ తనిఖీ చేశారు. ఎర్త్ వర్క్ నుంచి నిర్మాణ పనులు తుది దశ వరకు నిశితంగా వివిధ రకాల యంత్రాలతో తనిఖీలు చేపట్టారు. ఆయా గ్రామాల్లో నిర్మాణ పనులకు సంబంధించి అంచనాలు ఏ మేరకు పని పూర్తయిందో పరిశీలించారు. ఈ తనిఖీలో క్వాలిటీ కంట్రోల్ అండ్ విజిలెన్స్ ఏఈ శ్రీనివాస్, మండల ఏఈ మాధవరెడ్డి సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.



బల్లికురవలో సీసీ రోడ్లు తనిఖీ చేస్తున్న క్వాలిటీ కంట్రోల్ టీమ్